క్లుప్తంగా

బిలాల్ మసీదు అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల కేటాయింపు



నరసరావుపేట: ప్రకాష్‌నగర్‌లోని 12వ వార్డులో గల బిలాల్ మసీదు అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.5లక్షలు తన సొంత నిధుల్ని కేటాయించారు. ఆదివారం వార్డుకు చెందిన బిలాల్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. వారి సూచన మేరకు వార్డు కన్వీనర్‌గా షేక్ జిలానీని నియమించారు. దీనిపై మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధికార ప్రతినిధి భూమిరెడ్డి కొండారెడ్డి, కమిటీ మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

25న బూత్‌ల్లో ఓటర్ల దినోత్సవం



నాదెండ్ల: ప్రతి పోలింగ్ బూత్‌లో ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని తహసీల్దార్ ఏ.వి.రమణ ఆదేశించారు. నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, వీఆర్వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని 57 మంది బూత్‌లెవల్ అధికారులు హాజరయ్యారు. ఉదయం ప్రతి బూత్‌లో ప్రతిజ్ఞ నిర్వహించి, అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం-6, 7, 8 దరఖాస్తుల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కొత్త ఓటు కార్డుల్ని ఓటర్లకు వెంటనే పంపిణీ చేయాలని సూచించారు.

ప్రథమ చికిత్సతో ప్రాణాపాయం నుంచి రక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఫణికుమార్

నరసరావుపేట రూరల్: ప్రథమ చికిత్సతో ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని డాక్టర్ శిరీష, డాక్టర్ ఫణి కుమార్ తెలిపారు. ఆపదమిత్ర పథకంపై కోటప్పకొండలోని డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న తరగతుల్లో భాగంగా ఆదివారం ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతాలైన బెల్లంకొండ, అమరావతి, అచ్చంపేట, రెంటచింతల మండలాలకు చెందిన వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ శిరీష, డాక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు. విపత్తుల సమయంలో అందించే ప్రథమ చికిత్సలపై అవగాహన కల్పించారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు చేయాల్సిన అంశాల్ని వివరించారు. కార్డియాక్ అరెస్ట్ జరిగినప్పుడు సీపీఆర్, గుండెపోటు లక్షణాలు, దానికి గురైన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్సను డాక్టర్ శిరీష వివరించారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని తరలించే విధానం, గాయాలకు చికిత్సపై రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో కార్యాయల సిబ్బంది శ్యామ్, దాసు, పంచాయతీ కార్యదర్శులు కె.వి. శివప్రసాద్, మస్తాన్‌వలి, కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

రొంపిచర్ల: స్థానిక కాలనీలోని భగత్‌సింగ్ భవనంలో రష్యన్ సోషలిస్టు వ్యవస్థాపకుడు లెనిన్ 99వ వర్ధంతిని శనివారం రాత్రి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి భవన నిర్మాణ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లెనిన్ ఆలోచనలు ప్రస్తుత ప్రపంచానికి అవసరమని చెప్పారు. గుత్త పెట్టుబడిదారులు తమ లాభాల కోసం వివిధ దేశాల మధ్య విద్వేషాల్ని రగిలించి యుద్ధ సామగ్రి అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నారని ధ్వజమెత్తారు. బడా పెట్టుబడిదారుల ఎత్తుగడల్ని గమనించి ప్రపంచ ప్రజలు, కార్మికులు ఐక్యంగా ఉద్యమించి సమసమాజం సాధించడమే లెనిన్ మహాశయునికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ భవన నిర్మాణ కమిటీ సభ్యులు ఎస్. రామకృష్ణంరాజు, శేషంరాజు, మస్తాన్‌వలి, వెంకటసుబ్బరాజు, శంకరరావు పాల్గొన్నారు.

నేడు నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులోని నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో తులసీదాస్ తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మాఘశుద్ధ విదియలో లక్ష్మీగణపతి హోమం, మహన్యాసక రుద్రాభిషేకం, గోత్రనామ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ ఉంటుందని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వివక్షకు తావు లేకుండా సంక్షేమ పథకాల మంజూరు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వం
- కులం, మతం, ప్రాంతం, పార్టీ ఊసే లేదు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి రజిని

చిలకలూరిపేట: ప్రజలకు మేలు చేసే విషయంలో తమ ప్రభుత్వానికి వివక్ష లేదని, చేద్దాం, చూద్దాం అనే నిర్లక్ష్య ధోరణి అసలే లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 21వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా షరాఫ్ బజారులోని రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ వంటి విభేదాలు ఏవీ లేకుండా పని చేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. ఏ పార్టీ వారైనా సరే వివక్ష లేకుండా సమానంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ప్రభుత్వం వచ్చిన మొదటి రోజు నుంచే టీడీపీ కార్యకర్తలకు మాత్రమే పని చేయాలని అప్పట్లో చంద్రబాబు నాయుడు బాహాటంగానే ప్రకటించారని గుర్తు చేశారు. అందుకు విరుద్ధంగా తమ నాయకుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మొదటి రోజు నుంచే ప్రభుత్వానికి ప్రజలంతా సమానమని చెప్పారన్నారు. పార్టీ విభేదాలు చూడకుండా అందరికీ న్యాయం చేయాలని చెబుతూ ఆదర్శవంతమైన రాజకీయాలకు తెరతీశారని చెప్పారు. వృద్ధులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటింటికీ వలంటీర్లు వచ్చి ఫించన్లు అందజేస్తున్న ప్రభుత్వం తమదని తెలిపారు. పేదల్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాల్ని అందజేస్తున్నారని వివరించారు. ప్రతి సంక్షేమ పథకం ద్వారా నేరుగా ఆర్థిక లబ్ధిని ప్రజలు పొందేలా జగనన్న చూస్తున్నారని చెప్పారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఏ సంక్షేమ పథకం కింద ఎంత మొత్తం అందుతున్నదో చెప్పడానికే తాము ఇప్పుడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వార్డు ఇన్‌చార్జి ఆలపాటి పద్మావతి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు ఆలపాటి వెంకట్రావు, గ్రంధి శ్రీనివాసరావు, రావికింది సాంబశివరావు, పెరుమాళ్ల సత్యనారాయణ, తులాబంధుల సుధాకర్, మణిదీప్, గోల్డ్ సుభాని, పెన్నా సాంబశివరావు, పొట్టి రత్నబాబు పాల్గొన్నారు.

మూడున్నరేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

తొమ్మిదో వార్డు గడప గడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గత మూడున్నరేళ్ల పాలనలో పట్టణంలోని తొమ్మిదో వార్డులో రూ.11కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, పూర్తి చేశామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలనే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు తామంతా పాటుపడుతున్నామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం తొమ్మిదో వార్డు సాంబశివపేటలో ఆయన పర్యటించారు. వార్డు మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, కన్వీనర్లు గాలంకోటేశ్వరరావు, వెన్నపూస జోసెఫ్‌రెడ్డి, న్యాయవాది సింధుకూరి శ్రీనివాసరావు, షేక్ చాంద్ బాషా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లారు. ఇప్పటిదాకా అందించిన సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ, వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. వార్డు ప్రజల సమస్యల్నితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో పార్టీలకు అతీతంగా వార్డు ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.6.34కోట్లను ప్రభుత్వం అందజేసిందన్నారు. వార్డులో ఉన్న టీడీపీ మాజీ కౌన్సిలర్ ఇంటికి కూడా రైతు భరోసా, అమ్మఒడి, చేయూత పథకాలు అందాయని చెప్పారు. వార్డులో రోడ్డు, కాలువ పక్కన నివాసం ఉండేవారితో కలుపుకొని పేదలకు 281మందికి జగనన్న కాలనీల్లో ఇళ్లపట్టాలు, మరో 40మందికి టిడ్కో గృహాలు అందజేసినట్లు వెల్లడించారు. ఆప్షన్-3 ఇచ్చిన లబ్ధిదార్లకు ఇళ్ల నిర్మాణం చేసి ఇస్తున్నామని చెప్పారు. ఈ వార్డులో పంచాయతీలో ఉన్న కొంతభాగాన్ని పురపాలక పరిధిలో కలిపి రూ.4.71కోట్లతో మూడు కిలోమీటర్ల మేర పైపులైను వేసి తాగునీరు అందజేశామని చెప్పారు. రోడ్లు, వీధి దీపాలు, డ్రెయిన్ల నిర్మాణం చేశామని తెలిపారు. మార్కెట్ యార్డులో రూ.1.60కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణంలో ఉందని, దీనివల్ల ఇస్లాంపేట, ప్రకాష్‌నగర్, సాంబశివరావుపేట, శ్రీనివాసనగర్‌లో తాగునీటి ఇబ్బందులు తీరుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, మళ్లీ సీఎంగా జగన్ కావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, టీపీవో మోహనరావు, ఆర్ఐ సూర్యనారాయణరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర కుమార్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి పాలపర్తి సామ్రాజ్యం, రజాక్, డేవిడ్ మాస్టర్, మారూరి శివారెడ్డి, షేక్ కరీముల్లా, సయ్యద్ ఫాతిమా, మల్లెల అనీల, ద్వారక, సీహెచ్.అనూరాధ పాల్గొన్నారు.



వార్డు ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టాలి

ఆర్టీవో పరంధామరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీవో పరంధామరెడ్డి

నరసరావుపేట: ఆర్టీసీ ప్రయాణమంటే భద్రతతో కూడినదనే నమ్మకం ప్రయాణికుల్లో ఉందని, దాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని ఆర్టీవో టి.కె.పరంధామరెడ్డి తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, సిబ్బందికి రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ట్రాఫిక్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో రోడ్డు నిబంధనల్ని కచ్చితంగా పాటిస్తేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని చెప్పారు. డ్రైవర్లంతా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లకు లోను కావొద్దని ఆయన సూచించారు. రీజినల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుకోకుండా జరిగే ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నందున, డ్రైవర్లంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. రాంబాబు నిబంధనల్ని వివరించారు. సమావేశంలో డిపో మేనేజర్ వీరాస్వామి, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

నేడు బొల్లాపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి తెలిపారు. ఎంపీపీ బత్తి రాములు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభం కానుందని ఆమె పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

అడవి పేరంటాళ్లమ్మకు పూజలు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెంలో ఉన్న శ్రీ అడవి పేరంటాళ్లమ్మకు ఆదివారం ఆలయ పూజారి పవన్‌కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో పంచామృతలతో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, గోవిందరాజులు, కుమారి దంపతులు పాల్గొన్నారు.

కారుమంచి గ్రామ పంచాయతీకి ఎల్ఐసీ ఆర్థిక సాయం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామాన్ని 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ బీమా గ్రా మంగా ప్రకటించినట్లు వినుకొండ శాఖ బ్రాంచి మేనేజరు లక్ష్మీనాయక్ తెలిపారు. గ్రామంలో 75 పాలసీలు చేసిన దృష్ట్యా గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ.75వేల చెక్కును సర్పంచ్ మల్లాపరపు విశ్రాంతం చేతుల మీదుగా పంచాయతీకి అందజేసినట్లు చెప్పారు. ఒక వ్యక్తి ఎల్ఐసీ పాలసీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాల్ని వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విశ్రాంతం మాట్లాడుతూ గ్రామవీధుల్లో సోలార్ లైట్లు ఏర్పాటుకు ఈ నిధులు వినియోగిస్తామని చెప్పారు. కార్యక్ర మంలో ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ అధ్యక్షుడు చెరుకూరి హరినాథ్‌బాబు, ఏజెంటు సూరె హనుమంతరావు, మంగమ్మ, శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

28న నాదెండ్ల మండల పరిషత్ సమావేశం

నాదెండ్ల: స్థానిక మండల పరిషత్ సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు, ఉపాధి హామీ పనులు, సమస్యలపై చర్చ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మరియ యోసేపు దేవాలయ వసంతోత్సవం

నాదెండ్ల: కనపర్రులోని మరియ యోసేపుల దేవాలయం 125వ వసంతోత్సవం, నిశ్చితార్థం, కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు విచారణ గురువులు పగడాల చిన్నప్ప తెలిపారు. ఉదయం 7 గంటలకు దివ్య పూజాబలి, మొక్కుబడుల చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఆలయంలో క్యాథలిక్ సంప్రదాయ ప్రార్థనలు, ఆచార వ్యవహారాలు, విశేషంగా పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

చెకుముకి పోటీల్లో గణపవరం హైస్కూలుకు ప్రథమ బహుమతి



విజేతలైన విద్యార్థులతో గైడ్ రమణ

నాదెండ్ల: చెకుముకి టాలెంట్ టెస్ట్ రాష్ట్రస్థాయిలో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి మొదటి బహుమతి కైవసం చేసుకున్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కడపలో గత రెండు రోజులుగా జరుగుతున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.నాగయశ్వంత్ (పదో తరగతి), కార్తిక్‌రెడ్డి (9వ తరగతి), సీహెచ్. సాత్విక (8వ తరగతి) విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 52 టీములు పాల్గొన్నాయి. వివిధ అంశాల్లో ఆదివారం జరిగిన టాలెంట్ టెస్ట్‌లో గణపవరం హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి గణిత ఉపాధ్యాయులు కె.వి.రమణ, వై.శ్రీనివాసరావు గైడ్‌లుగా వ్యవహరించారు. విద్యార్థుల్ని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు దార్ల బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, ఎంఈవో ఆంజనేయులు, హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలి

- మంత్రి విడదల రజిని
- వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి రజిని



బైక్ ర్యాలీలో యువత

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు రైతుల శ్రేయస్సే లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం పని చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని యార్డు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్‌గా మానుకొండ శ్రీనివాసవీరారెడ్డి, పాలక మండలి సభ్యులుగా షేక్ అబ్దుల్ గని, మెట్టు రమాదేవి, కోయలమూడి అరుణ, జాష్టి పార్వతి, పమిడి శైలజ, గోరంట్ల బాపారావు, గుడికందుల వెంకటరత్నం, బండారు దాసు, దావల రత్నకుమారి, దేవరకొండ నాగేశ్వరరావు, సింగిరేసు పోలయ్య, పెరుమాళ్ల వెంకట సత్యనారాయణరావు, తోట గీతారాణి ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వంలో మార్కెట్ కమిటీలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావించాలని చెప్పారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు పల్నాడు జిల్లాలోనే పెద్దదని వెల్లడించారు. జగనన్న ప్రభుత్వంలో వరుసగా మూడో కమిటీ ఏర్పాటైందని, గతంలో రెండు పర్యాయాలు ఎస్సీ సామాజిక వర్గీయులకు చైర్మన్లుగా అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం కమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన తోట రాజేంద్రప్రసాద్ కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉందని వెల్లడించారు. ఆయన తండ్రి తోట భరతుడు చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మొట్ట మొదటి చైర్మన్‌గా పని చేశారని తెలిపారు. ఇదే కుటుంబానికి చెందిన తోట పాంచజన్యం రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా వ్యవహరించారని చెప్పారు. జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ పంట కొనుగోళ్ల సమయంలో రైతులెవరికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కమిటీపై ఉందని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వ ఫలాలు అన్నదాతలకు సజావుగా అందేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని చెప్పారు. అన్నదాతలకు మేలు చేసే విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కొమరవల్లిపాడు పీఏసీఎస్ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బొల్లెద్దు చిన్నా, మద్దిరాల విశ్వనాథం, బత్తినేని శ్రీనివాసరావు, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీ, తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, కోడె సుధారాణి, ముక్తావాసు, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, పఠాన్ తలహాఖాన్, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడ్డ ఏడుకొండలు

ఈపూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బోడిశంభునివారిపాలెం జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. శావల్యాపురం మండలం గుర్రంవారిపాలెం గ్రామానికి చెందిన గుర్రం ఏడుకొండలు వినుకొండలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన పాదయాత్రకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి గుంతలో పడటంతో తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనం ద్వారా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏడుకొండలు పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. ఎస్ఐ వెంకట్రావు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పౌడా చైర్మన్ మిట్టపల్లికి సన్మానం



మిట్టపల్లి రమేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని కోట సెంటర్‌లో గల జమిందారు ఫంక్షన్ హాలులో ఆదివారం పల్నాడు జిల్లా వాసవీ సేవా సమితుల సమాఖ్య ఆత్మీయ సమావేశాన్ని అధ్యక్షులు చీతిరాల గురుపెద్దన్న అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పౌడా) చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి రమేష్, అందుకు సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని దుశ్శాలువ, పూలదండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

చరితార్థుడు తోట భరతుడు

మంత్రి విడదల రజిని



తోట భరతుడు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర వైద్య మంత్రి రజిని

చిలకలూరిపేట: చేపట్టిన పదవులకు వన్నె తెచ్చిన చరితార్థుడు తోట భరతుడు అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని కొనియాడారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ తొలి చైర్మన్ తోట భరతుడు శత జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని కృష్ణానగర్‌లో ఉన్న మున్సిపల్ పార్కులో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రజిని మాట్లాడుతూ నరసరావుపేటతో కలసి ఉన్న ఉమ్మడి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీకి 1977లోనే చైర్మన్‌గా వ్యవహరించి రైతుల సమస్యలపై భరతుడు ఎంతో చిత్తశుద్ధితో పనిచేశారని చెప్పారు. ఆయన చైర్మన్‌గా ఉన్న కాలంలోనే చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ స్వతంత్రంగా ఏర్పడిందని వివరించారు. తన పదవీ కాలంలో నిత్యం రైతులకు అండగా ఉంటూ రోల్ మోడల్‌గా వ్యవహరించారని కొనియాడారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఆయన ఎంతో ఆదర్శనీయుడని వెల్లడించారు. పదవికి వన్నె తేవడంతో పాటు చిలకలూరిపేట మంచినీటి చెరువు ఏర్పాటుకు తోడ్పాటు అందించిన గొప్ప మనసున్న మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల కుమారస్వామి, తోట రామచంద్రప్రసాద్, విడదల గోపీనాథ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తనపల్లి

నరసరావుపేట ఈస్ట్: పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో ముత్తనపల్లి మాట్లాడుతూ బ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా పరిధిలో అన్ని నియోజకవర్గాలలో సంఘాన్ని పటిష్టపరచాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దండరాజు హనుమంతరావు, శనగల హనుమాన్‌శాస్త్రి, శ్రీనివాసరావు, కోట సాంబశివరావు, కె.వి.పురుషోత్తమరావు, ఎం.మధుసూదనరావు పాల్గొన్నారు.

అవోపా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నరసరావుపేట ఈస్ట్: సామాజిక సేవా కార్యక్రమాల్ని ఆర్యవైశ్యులు దైనందిన జీవితంలో భాగంగా నిర్వహించాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు తెలిపారు. శ్రీపట్టాభిరామస్వామి దేవస్థానంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం పట్టణ అవోపా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్యులు ముందుంటారని తెలిపారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ఎస్‌బీఐ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ కొత్తూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడు పానుగంటి శ్రీనివాస సాయి, కోశాధికారిగా కొటక్ మహేంద్ర బ్యాంక్ ఉద్యోగి కొత్తమాసు వెంకటప్పయ్య ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు అడ్వయిజరీ బోర్డు, ఆఫీస్ బేరర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, రీజినల్ కో-ఆర్డినేటర్ పొట్టి శ్రీరాములు, ఎస్ఈసీ కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.సుబ్బరాయగుప్త, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జాతీయ సహాయ కార్యదర్శి కె.పి.రంగారావు పాల్గొన్నారు.